క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వల్ప కాలిక కోర్సుల శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రధానాధికారి దేవరకొండ భూషణం శుక్రవారం తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ ఇస్తామని, అనంతరం ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు కో–ఆర్డినేటర్ రామకృష్ణ 8374039719ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి



మైలవరం: ఆటో డ్రైవర్లు రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ పేర్కొన్నారు. స్థానిక భారత్ రోడ్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ సొసైటీ, బెస్ట్ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో, ఎస్ఎస్‌కే స్కూల్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు సేఫ్ డ్రైవింగ్–సేవ్ లైవ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఏసీపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. వలంటరీ, హెల్త్, ఎడ్యుకేషనల్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ యూనిట్ రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ డైరెక్టర్ ఎం. వాసు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లను భాగస్వామ్యం చేస్తూ మైలవరం పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సై హరిప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, బెస్ట్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ వై.జమలయ్య, ఎస్ఎస్‌కే స్కూల్ డైరెక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

పాపాలు తొలగించేందుకు దేవుడే జన్మించాడు



మైలవరం: మానవుల్లోని పాపాలు తొలగించేందుకు దేవుడే మానవుడై ఏసుప్రభువుగా ఈ లోకంలో జన్మించనున్నాడని రెవరెండ్ ఫాదర్ భావను విజయరాజు తెలిపారు. మైలవరం శాంతినగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో నెలలో మొదటి వారం భక్తి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో పవిత్ర జపమాల, దివ్య బలిపూజ, దివ్య సత్ప్రసాద ఆరాధన, స్వస్థతా ప్రార్థనలు నిర్వహించారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గం ఎన్నిక



తిరువూరు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తిరువూరు పట్టణ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక సుందరయ్య భవన్లో జరిగిన ఫెడరేషన్ పట్టణ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా కే ప్రసాద్, కార్యదర్శిగా వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మోహన్‌కృష్ణ, సహాయ కార్యదర్శిగా చక్రవర్తి ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేశ్వరరావు, మోహనకృష్ణ పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఏ.కొండూరు: సకాలంలో రుణాలు చెల్లించాలని వెలుగు ఏపీఎం ఆర్. సత్యం అన్నారు. మండలంలోని చీమలపాడు, కృష్ణారావు పాలెం గ్రామాల్లో వీఓ గ్రామైక్య సంఘాల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న లింకేజీ రుణాలు సకాలంలో చెల్లించి, మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేకపూజలు



తిరువూరు: కార్తిక మాస పునర్వసు నక్షత్ర సందర్భంగా స్థానిక కోదండ రామాలయంలో తిరుమంజనం కార్యక్రమం జరిగింది. సీతారామచంద్రస్వామికి నూతన వస్త్రాలతో అలంకరించడంతో పాటు వైష్ణవ సంప్రదాయ ప్రకారం నైవేద్యాలు సమర్పించారు.

రేపు పూర్వవిద్యార్థుల సమావేశం

తిరువూరు: తిరువూరు చీరాల సెంటరులోని సర్వోదయ ప్రాథమికోన్నత పాఠశాలలో 1973లో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 3న జరుగుతుందని నిర్వాహకులు వీ అంజయ్య తెలిపారు. రాజుపేట విజన్ హైస్కూల్ దగ్గర మామిడి తోటలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కార్తిక వనసమారాధన కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు 9490881166లో సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఏ.కొండూరు మండలం కంభంపాడులో సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



చాట్రాయి మండలం పోలవరంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న బాబ్జీ



ఆగిరిపల్లి మండలం నరసింగపాలెంలో బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నూజివీడులో పథకాల లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



గంపలగూడెం మండలం కొణిజెర్లలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు



వెల్లటూరులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన నాయకులు



వేమిరెడ్డిపల్లి సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి

ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడులో శుక్రవారం పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా గ్రామాల్లోనే గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరుకు దరఖాస్తు చేయించిన వెంటనే అర్హులందరికీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, మాజీ సర్పంచ్ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నారావు, రేజా పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి పథకాలు దోహదం

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ పేర్కొన్నారు. పోలవరం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరాం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన ఎంతో అవసరమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు అన్నారు. నరసింగపాలెంలో 'వై ఏపీ నీడ్స్' జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం డిస్‌ప్లే బోర్డును నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనకుమారి, సర్పంచ్ అనూష, పీఏసీఎస్ అధ్యక్షుడు రామచంద్రరావు, నాయకులు ఇస్సాకు, పురుషోత్తం, కరుణాకర్ పాల్గొన్నారు.

అక్కపాలెంలో..

అక్కపాలెం(తిరువూరురూరల్): పేదరిక నిర్మూలనకు పలు పథకాలను రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తోందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మండలం అక్కపాలెంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటనరసమ్మ, ఎంపీపీ గద్దల భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసురత్నం, గుడిపూడి నారాయణరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగనన్న

కొణిజెర్ల(గంపలగూడెం): పేదల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి అభివృద్ధి కోరుతూ సంక్షేమ పథకాలను చేపట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండలం కొణిజెర్లలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు రాధమ్మ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కరుణాకర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

వెల్లటూరులో..

జి.కొండూరు: మండలంలోని వెల్లటూరులో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం–2లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును నాయకులు ప్రారంభించారు.

వేమిరెడ్డిపల్లిలో..

వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండంలోని వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో పల్లెకుపోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి డిస్‌ప్లే బోర్డును వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. సర్పంచ్ విజయకుమారి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణచారి, మణి, నాయకులు సుబ్బారావు, వెంకట్రామయ్య, రాము పాల్గొన్నారు.

ప్రజలంతా వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి

నూజివీడు: పేదలు, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగం అందుకోవాలన్నా మళ్లీ వైఎస్ జగనే సీఎంగా రావాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము అన్నారు. పట్టణంలోని 11వ వార్డు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. సచివాలయాల కన్వీనర్ చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, నాయకులు ఆదినారాయణ, రత్నకుమారి, కృపారావు, డీడీ సాల్మాన్, కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ముసునూరు: గ్రామాల సమగ్ర అభివృద్ధే జగనన్న ప్రధాన లక్ష్యమని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోపవరం –2 గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కె.వాణి అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి ప్రత్యక్ష నగదు బదలీ, పరోక్ష నగదు ప్రయోజన రూపంలో అందిన పథకాల గణాంకాలను నేతలు వివరించారు. అనంతరం పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును వైస్ ఎంపీపీ–2 పి.గంగాధర్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్, నాయకులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వెంకమ్మ, ఖాలీషా మస్తాన్ వలి, సొసైటీ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ లక్ష్మయ్య, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ సామాజిక బాధ్యత



తిరువూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రక్షణనిధి తదితరులు



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు



నూజివీడులో ర్యాలీని నిర్వహిస్తున్న వైద్యాధికారులు, విద్యార్థులు

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ఎయిడ్స్, హెచ్ఐవీల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ప్రజల్లో చైతన్యం కలిగించాలని ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రి ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల్లో సైతం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అన్నిరకాల వైద్యపరీక్షలు చేస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఎయిడ్స్ నిర్మూలనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, రాజవర్ధన్ పారా మెడికల్, ఒకేషనల్ కళాశాలల అధినేత సుబ్బారావు, ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, నగర పంచాయతీ కౌన్సిలర్లు, విద్యార్థులు ప్రభుత్వాస్పత్రి నుంచి ఫ్యాక్టరీ సెంటర్ వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

మైలవరంలో..

మైలవరం: ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించడంలో యువత ప్రముఖ పాత్ర వహించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ వీ. ఫణికుమార్ మాట్లాడారు. విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి, వ్యాధికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వద్ద విద్యార్థులు మానవ హారం ఏర్పాటు చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

నూజివీడు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దయాల ఆశా అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్నేహా రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, ఐసీటీసీ కౌన్సిలర్ కోటేశ్వరరావు, రైడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్‌కు అంతం

ముసునూరు: ఎయిడ్స్‌ను అంతమొందించాలంటే మనందరం, ప్రజలందరిలో హెచ్ఐవీ వైరస్, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహనకు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు కరీముల్లా, షకీనా ఇవాంజిలిన్, అవినాష్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ రమణక్కపేట, ముసునూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓలు అర్జునరావు, అలెగ్జాండర్, ఎంపీహెచ్ఏ దుర్గారావు, మహేష్ పాల్గొన్నారు.

రేపు ఘంటసాల చిత్రగీతాల పోటీలు

విజయవాడ కల్చరల్: శ్రీధర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 101 జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి ఘంటసాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మంగరాజు తెలిపారు. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 3వ తేదీ ఆదివారం 2 గంటల నుంచి కౌతా పూర్ణానందం కళావేదికపై పోటీలు ప్రారంభమవుతాయన్నారు జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 83319 27473, 94923 77473 నంబర్లలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, దండు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

తిరువూరు: విద్యార్థినులు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే తీవ్ర ఇబ్బందులు తప్పవని మహిళా వైద్యనిపుణులు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల ఆరోగ్య సమస్యలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయాలని సూచించారు. బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని, జంక్‌ఫుడ్స్ జోలికి వెళ్లొద్దని తెలిపారు. విద్యాసంబంధ ఒత్తిడి అధిగమించేందుకు యోగా చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

ఎస్సై ధర్మరాజుకు సన్మానం



జి.కొండూరు: స్థానిక ఎస్సై ఆర్.ధర్మరాజు బదిలీపై వెళుతున్న క్రమంలో జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎస్సైని సన్మానించిన ఎంపీపీ జ్ఞాపికను బహూకరించారు.

నేడు, రేపు ఓటర్లకు అవగాహన

తిరువూరు: కొత్తగా ఓటుహక్కు పొందిన వారికి ఈ నెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధవి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం, ఓటు ఆవశ్యకతను వివరిస్తూ ఈ సదస్సులు ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, తమ పేరు, వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఓటర్లు పరిశీలించుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలు, మృతుల పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు తమ ఓటుహక్కు బదిలీ చేసుకోడానికి ఈ నెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆగిరిపల్లి: డిజిటల్ అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కే మరియమ్మ తెలిపారు. చిన్నగిరిపల్లిలో నాబార్డ్ సౌజన్యంతో సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డు, రూపే కార్డు, డెబిట్ కార్డుల వినియోగం, నగదు రహిత లావాదేవులపై శుక్రవారం కళాజాత నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



నూజివీడులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ రంగారావు

జి.కొండూరు: మండలంలో ఇప్పటికే ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అనురాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆమె శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలో వచ్చే జనవరికల్లా 538 ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతం చేసేందుకు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంఈఓలు, పీఈటీలు, పీడీలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

నూజివీడులో..

నూజివీడు: బేస్‌మెంట్ లెవెల్ నుంచి రూఫ్ లెవెల్ వరకు ఉన్న పక్కా గృహాల నిర్మాణాన్ని 2024 జనవరి 31లోగా పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ రంగారావు ఆదేశించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి సమావేశ మందిరంలో శుక్రవారం నూజివీడు పట్టణం, మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, డ్వాక్రా గ్రూపుల బుక్ కీపర్లకు, మెప్మా ఆర్పీలకు సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, మెప్మా సీఎంఎం ఆనంద్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదింటి తలుపు తట్టిన పింఛన్లు



ముసునూరులో మంచం పట్టిన వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

ముసునూరు: అర్హులైన పేదలందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకల పథకం మేలు చేస్తోందని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు పేర్కొన్నారు. మీ పింఛన్ మీ గడప వద్దకే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పింఛన్లను పంపిస్తానన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ప్రకారమే పొద్దు పొడవక ముందే పింఛన్లు లబ్ధిదారుల తలుపులు తట్టాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ల పంపిణీని శుక్రవారం తెల్లవారు జామునే ఆరంభించారు. మండలంలో మొత్తం పెన్షన్లు 8,055 అందులో 5,470 మందికి పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు.

తెల్లవారుజాము నుంచే..

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తమకు కేటాయించిన గృహాల్లోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలో మొత్తం 8,624 మంది లబ్ధిదారులుండగా 6,790 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దుర్గాప్రసాదు తెలిపారు.

సహకార కేంద్ర బ్యాంకు సౌకర్యాలపై కళాజాత

ముసునూరు: సహకార బ్యాంకుల ద్వారా ప్రజలకు అన్ని రకాల రుణాలు అందుతున్నాయని, వాటిని వినియోగించుకోవాలని కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. సహకార బ్యాంకులు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ప్రజలకు విరివిగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఖాతాలు తెరుచుకోవాలన్నారు. శుక్రవారం రాత్రి లోపూడిలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పేరం కృష్ణ ఆధ్వర్యంలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ద్వారా రైతులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు రాజానాయన, కార్యదర్శి దుర్గారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ ఢిల్లీరావు



స్మృతివనం సుందరీకరణ పనులను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణం, స్మృతివనాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్వరాజ్య మైదానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రాంగణాన్ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. సందర్శకులు స్మృతివనంలోకి అడుగుపెట్టగానే ఆకట్టుకునేలా ఉండాలన్నారు. రాజ్యాంగ ఔన్నత్యానికి, ఐక్యతకు, సామరస్యానికి నెలవైన ప్రాంగణం ప్రశాంత వాతావరణానికి వేదికగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. స్మృతివనం ప్రాజెక్ట్ ఆర్కిటెక్చర్ సత్యనారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళ.. భళా..



కొబ్బరికాయతో పూరి జగన్నాథుడి ఆలయం నమూనా



కోడిగుడ్డు, బల్లి గుడ్డు, జీడిపప్పు, బాదం పప్పుపై ఇండియా మ్యాప్

- మైక్రో ఆర్ట్స్‌తో గుర్తింపు పొందుతున్న యనమలకుదురువాసి సుజాత
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు
- బల్లి గుడ్డు, ఉసిరి, టూత్‌పిక్‌లపై ఆర్ట్



సుజాత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటి పనులు పూర్తయిన తర్వాత ఖాళీ దొరికితే చాలు.. టీవీ సీరియల్స్ చూస్తే కాలక్షేపం చేయకుండా కాస్త భిన్నంగా ఆలోచించి సూక్ష్మ కళపై దృష్టి పెట్టారు. యనమలకుదురుకు చెందిన 55 ఏళ్ల నడకుదిటి సుజాత. కళాత్మక దృష్టితో పెన్సిల్ మొనతో మంచి ఆకృతులను తయారుచేస్తున్నారు. నిత్యం పత్రికలు చదువుతూ వాటిలో మైక్రో ఆర్ట్స్‌పై వచ్చిన కథనాలను చదివి తాను కూడా ఇలా ఎందుకు చేయకూడదు అనే ఆలోచన సుమారు ఏడేళ్ల క్రితం వచ్చింది. ఆమె వెంటనే దానిని ఆచరణలో పెట్టారు. ఉసిరి చెట్టు ఆకులపై అక్షరాలు, కోడి, వివిధ పక్షులు పెట్టే గుడ్లపై వివిధ రకాల బొమ్మలు వేస్తూ స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, వివిధ పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు ఇలా సందర్భాన్ని బట్టి కోడి గుడ్లపై బొమ్మలు గీయడం సుజాతకు అలవాటుగా మారింది. పాత నాణేల సేకరణ, కరెన్సీ నోట్లపై ఉన్న నంబర్లలో బంధువులు, స్నేహితుల పుట్టిన రోజు, పెళ్లి రోజులను గుర్తించి వాటిని సుజాత బహుమతిగా వారికి అందజేస్తుంటారు. ఈ వైవిధ్యమైన కళను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించి ఈ ఏడాది ఆగస్టులో సుజాత పేరుతో రికార్డ్ నమోదు చేసుకుని గుర్తింపు పత్రాన్ని అందజేశారు.